# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఆమోదం చారిత్రాత్మక మలుపు అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆరోగ్యశాఖ సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**
3. **ప్రభుత్వ సేవలలో సులభతర విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోందని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్  వెల్లడించారు.**
4. **లలిత కళల ప్రాధాన్యంపై "అమరావతి చిత్రకళ వీధి" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**
5. **కోకో పంటల నాణ్యత ప్రమాణాలు పెంచేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారు.**

==========================

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఆమోదం చారిత్రాత్మక మలుపు అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం బిమ్‌స్టెక్ సదస్సు కోసం థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి  ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. వక్ఫ్ సవరణ బిల్లు, ముసల్మాన్ వక్ఫ్ -ఉపసంహరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం హర్షణీయమని పేర్కొన్నారు. సామాజిక-ఆర్థిక న్యాయం, పారదర్శకత,  సమష్టి అన్వేషణలో ఇది  ఓ కీలక ఘట్టం అని తెలిపారు. ఈ  చట్టాల బలోపేతం కోసం సహకరించిన కమిటీ సభ్యులు, చర్చల్లో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో సవరణల కోసం పార్లమెంటరీ కమిటీకి  విలువైన సూచనలు పంపిన పౌరులకు ప్రత్యేక ధన్యవాదాలు అని ప్రధానమంత్రి  పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆరోగ్యశాఖపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. అనంతరం ఈ మధ్యాహ్నం కార్మిక శాఖపై సమీక్ష నిర్వహించడంతోపాటు రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటారు.

ఇది ఇలా ఉండగా.. రాష్ట్రంలో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం 16వ ఆర్థిక సంఘం ఈనెల 14వ

తేదీన రాష్ట్ర పర్యటనకు రానున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నిన్న అమరావతి సచివాలయంలో ఆర్థిక శాఖ అధికారులతో సమావేశమై ఆర్థిక సంఘం పర్యటనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

---------------------------

మంగళగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఈ రోజు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజల కోసం దాదాపు 26 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 'ఎన్టీఆర్ సంజీవని' పేరుతో మంగళగిరి, తాడేపల్లిలో క్లినిక్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 13వ తేదీన వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రజలకు అందించే ప్రభుత్వ సేవలలో సులభతర విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోందని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, తొలి విడతలో భాగంగా 26 జిల్లాల్లోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా సమయం ఆదా అవుతుందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

లలిత కళల గురించి ప్రజలకు తెలియజేసేందుకు "అమరావతి చిత్రకళ వీధి" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ రోజు ప్రారంభమైన " అమరావతి చిత్రకళ వీధి" కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

నాణ్యమైన కోకో గింజలను స్థానిక రైతుల నుండి అంతర్జాతీయ మార్కెట్ ధరల కంటే ఐదు నుంచి పది శాతం అధికంగా చెల్లించి కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సంబంధిత సంస్థలను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కోకో రైతులు, సంస్థల ప్రతినిధులు, ఉద్యాన శాఖ అధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కోకో పంటల నాణ్యత ప్రమాణాలు పెంచేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని అధికారులకు మంత్రి సూచించారు.

---------------------------

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం క్రింద ఈ ఏడాది 120 లక్షల పనిదినాలు కల్పిస్తామని

అనంతపురం జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. అనంతపురంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నీటి నిల్వ, భూసార సంరక్షణ వంటి పనులను చేపట్టనున్నామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

"అంతర్జాతీయ గనుల అవగాహనా దినోత్సవాన్ని" ఈరోజు జరుపుకుంటున్నాం. పలు దేశాల్లో సామజిక, ఆర్థిక అభివృద్ధికి, జనాభాకు గనులు, పేలుడు పదార్థాల అవశేషాలు తీవ్ర అవరోధం కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో వీటి ప్రభావాన్ని ఎదుర్కొంటున్న దేశాల్లో ప్రమాదాలను నివారించే లక్ష్యంతో ఈ రోజును నిర్వహిస్తున్నారు. జాతీయ గనుల రక్షణ చర్యలను సమర్ధంగా రూపొందించి.. అమలు చేసే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి "గనుల అవగాహనా దినోత్సవాన్ని" ప్రతి ఏటా ఏప్రిల్ 4వ తేదీన నిర్వహిస్తోంది. గనుల రక్షణ, ప్రజల ఆరోగ్యం, భద్రత చర్యలు వంటి అంశాలపై ఈరోజు అవగాహన కల్పిస్తున్నారు.

---------------------------

ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో యం ఎస్ యం ఈ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమల అభివృద్ధి ద్వారా స్వయం ఉపాధి ఉద్యోగ కల్పన మెరుగవుతాయని అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని మంత్రి వివరించారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణకు సముద్రపు తాబేళ్ళు ఎంతగానో దోహదపడతాయని చీరాల శాసనసభ్యులు కొండయ్య అన్నారు. బాపట్ల జిల్లా, వేటపాలెం మండలం రామాపురం సముద్ర తీరంలో తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుండి 4 వందల సముద్రపు తాబేలు పిల్లలను ఆయన ఈరోజు సముద్రంలోకి వదిలారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ, అంతరించిపోతున్న సముద్రపు తాబేళ్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అరుదైన ఆలివ్ రిడ్లే సముద్ర తాబేళ్లను సంరక్షించడం కోసం అటవీ శాఖ ఇతర స్వచంద సంస్థలు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఇప్పటివరకు ఎనిమిది చోట్ల బర్డ్ ఫ్లూ వైరస్ గుర్తించామని పశుసంవర్ధక , మత్స్య శాఖా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా చోట్ల నుంచి కిలోమీటర్ పరిధిలో ప్రభావిత జోన్లుగా, 10 కిలోమీటర్ల పరిధిలో నిఘా జోన్లుగా ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని వేల్పూరు, కానూరు అగ్రహారం, ఏలూరు జిల్లా బాదంపూడి, ఎన్టీఆర్ జిల్లా అనుమల్లంక, కృష్ణారావుపాలెం, కాకినాడ జిల్లా 21వ వార్డు, చందుర్తిలోనికోళ్ల పారాల్లో, కర్నూలు జిల్లా ఎన్ ఆర్ పేటలో బాతులకు ఈ వైరస్ సోకినట్లు గుర్తించామని తెలిపారు.

=====================